# కాళేశ్వరం జలాలతో నీలి విప్లవం

## నిండుకుండలా చెరువులు, కుంటలు



అర్వపల్లి : బొల్లంపల్లి గ్రామంలోని ఒట్టికుంట చెరువులో పట్టిన చేపలు

**కేసీఆర్ సర్కార్ సాయంతో విరివిగా చేపల పెంపకం**

**10మండలాల్లో భారీగా పెరిగిన ఆదాయం**

కాళేశ్వరం జలాల రాకతో జిల్లాలో నీలి విప్లవం ఊపందుకుంది. కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయలో భాగంగా చెరువులను పునరుద్ధరించగా ప్రస్తుతం అవి వేసవిలో సైతం నిండుకుండను తలపిస్తున్నాయి. దానికి తోడు ప్రభుత్వ సాయంతో మత్స్యకారులు విరివిగా చేపలు సాగు చేస్తున్నారు. కాళేశ్వరం ఆయకట్టు పరిధిలోని తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లోని 10మండలాల మత్స్యకారుల ఆదాయం ఏడేండ్ల క్రితం రూ.15కోట్లు ఉంటే ప్రస్తుతం అది రూ.114కోట్లకు చేరడం విశేషం.

– సూర్యాపేట, జనవరి 5 (నమస్తే తెలంగాణ)

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తర్వాత అంతటి ప్రాధాన్యం కలిగింది చేపల పెంపకమే. అలాంటి చేపల పెంపకాన్ని ప్రోత్సహించి మత్స్య కార్మికులకు ఉపాధి కల్పించాలని కేసీఆర్ సర్కారు భావించింది. దానిలో భాగంగా మునుపెన్నడూ లేని విధంగా మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసింది. దీంతో చేపల పెంపకం గణనీయంగా పెరిగింది.

### కరువు నుంచి కసితీరా చేపలు

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి, మద్దిరాల, నూతనకల్ మండలాలతో పాటు సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని చివ్వెంల, ఆత్మకూర్.ఎస్, పెన్‌పహాడ్, కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె మండలాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఉన్నాయి. కాళేశ్వరం వచ్చేంత వరకు ఈ మండలాలు కరువుతో అల్లాడుతూ చేపలు తిందామంటే దొరకని పరిస్థితి. కేసీఆర్ సర్కార్ వచ్చాక మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు పునరుద్ధరించారు. శ్రీరాంసాగర్ రెండోదశ ద్వారా జిల్లాలోని ఈ ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాలకు కాళేశ్వరం జలాలు రావడంతో చెరువులన్నీ నిండి వ్యవసాయం పండుగలా మారింది. ప్రభుత్వమే ఉచితంగా కోట్లాది చేప పిల్లలు పంపిణీతో ప్రస్తుతం పుష్కలంగా చేపలు తింటూనే ఇతర ప్రాంతాలకు విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు.

**పెరిగిన మత్స్యసంపద వివరాలు**

| సంవత్సరం | నీరున్న చెరువులు | పంపిణీ చేసిన చేప పిల్లలు | చేతికి వచ్చిన చేపలు | మొత్తం విలువ |
|---|---|---|---|---|
| 2016-17 | 52 | 35లక్షలు | 17లక్షల కిలోలు | 15కోట్లు |
| 2017-18 | 74 | 41లక్షలు | 23లక్షల కిలోలు | 18కోట్లు |
| 2018-19 | 96 | 127.74లక్షలు | 47లక్షల కిలోలు | 38కోట్లు |
| 2019-20 | 208 | 133.31లక్షలు | 66లక్షల కిలోలు | 79కోట్లు |
| 2020-21 | 278 | 185.57లక్షలు | 95లక్షల కిలోలు | 114కోట్లు |
| 2021-22 | 278 | 186.84 లక్షలు | 96లక్షల కిలోలు | 114కోట్లు |
| 2022-23 | 278 | 185.30 లక్షలు | 95లక్షల కిలోలు | 114కోట్లు |

### రూ.15నుంచి రూ.114కోట్లకు ఆదాయం

ఏడేండ్ల క్రితం వరకు జిల్లాలోని 10మండలాలకు నీటి కరువు ఉండడంతో ఆయా మండలాల పరిధిలోని 278 చెరువులకు గాను 15శాతం చెరువుల్లో ఓ స్థాయిలో నీరు ఉండేది. మరో పదిశాతం చెరువుల్లో కొద్దిపాటి నీరు ఉండడంతో సుమారు 62 చెరువుల్లో ఆయా మత్స్య కార్మిక సొసైటీల ఆధ్వర్యంలో సుమారు 35లక్షల చేప పిల్లలు వేయగా వాటి ద్వారా ఏటా దాదాపు 15కోట్ల రూపాయల మత్స్య సంపద చేతికి వచ్చేది. ప్రస్తుత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మొత్తం 278 చెరువుల్లో గోదావరి జలాలు ఉండడంతో మూడేండ్లుగా రూ.2.5కోట్లకు పైనే చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లో పంపిణీ చేస్తున్నది. వాటిని మత్స్య సహకార సొసైటీల వారు విక్రయించగా ఏటా రూ.114కోట్లకు పైనే మత్స్య సంపద మత్స్య కార్మికుల చేతికి వస్తున్నది. గోదావరి ఆయకట్టు పరిధిలో మొత్తం 278 చెరువులకు గాను ప్రభుత్వం సరఫరా చేసే కట్ల, రాహు, మెరిగల చేపలను మార్కెట్‌లో కిలో ధర సరాసరి రూ.120 పలుకుతుందని మత్స్య కార్మిక సొసైటీలు పేర్కొంటున్నాయి. చెరువుల్లో వేసే చేప పిల్లలు దాదాపు 50శాతం వేస్టేజీ కింద పోను మిగిలిన చేపలను విక్రయిస్తుంటారు. ఐదేండ్లలో జిల్లాలోని గోదావరి ఆయకట్టు పరిధిలోని తొమ్మిది మండలాల్లో ఏటేటా మత్స్య సంపద పెరుగుతున్నది.

### గతంలో చేపలు కొనుక్కుని తినేవాళ్లం




తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మత్స్యకారులు సైతం చేపలు కొనుక్కుని తినాల్సిన పరిస్థితి ఉండేది. వర్షాకాలంలోనూ చెరువుల్లో చుక్క నీరు ఉండేది కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ సర్కార్ మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువులు పూడిక తీసి పునరుద్ధరించారు. కాళేశ్వరం జలాలతో వాటిని నింపడంతో పాటు మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేసింది. దీంతో ప్రతి చెరువు, కుంటల్లో పుష్కలంగా చేపలు ఉన్నాయి. ప్రస్తుతం మత్స్యకారులు పుష్కలంగా చేపలు తినడమే గాక ఇతరులకు అమ్మి ఆర్థికంగా ఎదుగుతున్నారు.

– జంగా వెంకటేశ్వర్లు, నెమ్మికల్

# పట్టభద్రులకు పరీక్ష

- ప్రతీసారి ఓటు నమోదు తప్పనిసరి
- చెల్లుబాటు కాని గత ఎన్నికల ఓటర్ల జాబితా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో మొదలైన ఓటర్ల నమోదు
- వచ్చే నెల 6వ తేదీ తుది గడువు




నల్లగొండ ప్రతినిధి, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. 2027 మార్చి 29వ తేదీ వరకు మిగిలిన పదవీకాలం కోసం నిర్వహించనున్న ఉప ఎన్నికకు కసరత్తు మొదలైంది. అందులో భాగంగా తొలి అంకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రాధాన్యమిస్తూ ఓటు నమోదుకు శ్రీకారం చుట్టింది. నవంబర్ 30వ తేదీన పబ్లిక్ నోటీసు జారీ చేస్తూ అదే రోజు నుంచి ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఫారం-18 ద్వారా ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. 2023 నవంబర్ 1నాటికి డిగ్రీ పూర్తై మూడేళ్లు నిండిన వారందరూ దరఖాస్తుకు అర్హులుగా నిర్దేశించింది. వచ్చే నెల 6వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులన్ని పరిశీలించిన అనంతరం అదే నెల 21న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాపై మార్చి 14వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. చివరగా అభ్యంతరాలు పరిష్కరించాక ఏప్రిల్ 4వ తేదీన తుది ఓటర్ల జాబితా పూర్తి చేయాల్సి ఉంది. తుది ఓటర్ల జాబితా రూపకల్పన అనంతరం ఏ క్షణమైనా ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఏప్రిల్ చివరలో లేదా మే మొదటి వారంలో ఎన్నిక పూర్తి కావచ్చని అంచనా. జూన్ 8వ తేదీ లోపు ఉప ఎన్నిక పూర్తికి కేంద్ర ఎన్నికల సంఘం గడువు విధించింది.

### కొత్తగా ఓటు హక్కు నమోదు తప్పనిసరి

సాధారణ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఒకసారి ఓటు నమోదు చేసుకుంటే సరిపోతుంది. కానీ పట్టభద్రుల ఎన్నికల్లో అలా కుదరదు. ఎన్నిక జరిగిన ప్రతిసారి ప్రతీ గ్రాడ్యుయేట్ కొత్తగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాల్సిందే. 2021మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఓటు వేశాం కనుక అదే జాబితాతో ఓటు వేస్తామంటే అవకాశం లేదు. అందుకే ఓటుకు అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తాజాగా ఓటు కోసం దరఖాస్తు చేయాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది. వాస్తవంగా 2021 మార్చిలో జరిగిన ఎన్నికలో రికార్డు స్థాయిలో 5,05,565మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2015 మార్చి ఎన్నికల్లో 2,81,138మందినే ఓటర్లుగా ఉండడం గమనార్హం. 2015తో పోలిస్తే 2021 మార్చి నాటికి 2,24,427 మంది అదనంగా ఓటర్లు చేరారు. అయితే ప్రస్తుతం ఉప ఎన్నిక కావడంతో ఏ మేరకు ఓటర్ల నమోదు జరుగుతుందనే వేచి చూడాల్సిందే. గత ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు సైతం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున ఓటర్ల నమోదు జరిగిందనేది స్పష్టం. ఉప ఎన్నిక కావడంతో ఈసారి ఇప్పటికైతే అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఉప ఎన్నికపై రాజకీయ పార్టీలు, పోటీ చేయాలనుకునే ఆశావాహులు దృష్టి సారించాల్సిన అవసరముంది. సంకాంత్రి తర్వాత ఓటర్ల నమోదు ఊపందుకోవచ్చని అంచనా.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

### ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

# పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 5 : ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే డాటా ఎంట్రీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన రీసోర్స్‌పర్సన్ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆన్‌లైన్ నమోదుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తులో పేర్కొన్న ప్రకారం మాత్రమే వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని, నమోదు అనంతరం ప్రివ్యూ చూశాక సబ్మిట్ చేయాలన్నారు. అనంతరం వచ్చిన నంబర్‌ను సంబంధిత దరఖాస్తుపై తప్పనిసరిగా రాయాలని సూచించారు. డాటా ఎంట్రీ చేశాక మీకిచ్చిన దరఖాస్తులను తిరిగి జాగ్రత్తగా సంబంధిత సూపర్‌వైజర్లకు అందించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు